

గోదావరిలో పుణ్య స్నానం ఆచరిస్తున్న భక్తులు



ముక్తీశ్వరాలయంలో హోమంలో నిర్వహిస్తున్న అర్చకులు

కాళేశ్వరంలో ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు

మహదేవపూర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుప్రసిద్ధ కాళేశ్వరాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన మహా శివరాత్రి ఉత్సవాలు గురువారం ముగిశాయి. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం 8 గంటలకు కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి మహన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. పూర్ణాహుతి సదస్యం, మహా ఆశీర్వచన కార్యక్రమాలు, పూజలు చేశారు. సాయంత్రం నాకా బలి పవలింపు సేవ నిర్వహించారు. దీంతో ఉత్సవాలు ముగిసాయి. ఈ మూడు రోజుల్లో తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొత్తం 2 లక్ష మంది పైచిలుకు మంది స్వామి వారిని దర్శించుకున్నారని అధికారుల అంచనా. గురువారం సుమారు 5 వేల మంది భక్తులు తరలివచ్చారు.

ఘనంగా ఆది ముక్తీశ్వరస్వామి కల్యాణం

కాళేశ్వరాలయ అనుబంధ దేవాలయమైన శ్రీ ఆది ముక్తీశ్వర స్వామి శుభానందదేవి కల్యాణం గురువారం కనుల పండువగా జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఈ తంతును వేద పండితులు, అర్చకులు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, ఫణి శర్మ నగేష్, పాండే తదితరులు పాల్గొన్నారు.



ఆదిముక్తీశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

- వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ స్థానానికి జిల్లాలో 93.62 శాతం ఓటింగ్
- 329 మందికి 308 మంది ఓటు హక్కు వినియోగం
- కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీకి 93 శాతం పోలింగ్
- మొత్తం 83 మందిలో ఓటు వేసింది 77 మంది
- పట్టభద్రులు 2,483 మందికి.. 1,903 ఓట్లు పోల్
- 76 శాతం పోలింగ్ నమోదు

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎన్నికతోపాటు కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికలకు పోలింగ్ జరిగింది. భూపాలపల్లి జిల్లాలో మొత్తం 17 కేంద్రాల్లో ఈ ఎన్నికలు జరగ్గా ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు పోలింగ్‌ను నిర్వహించారు. ఈ పోలింగ్ సరళిని కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షించారు. భూపాలపల్లి, కాటారం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎన్నికలు పూర్తయ్యాక బ్యాలెట్ బాక్సులను నల్లగొండ, కరీంనగర్‌కు పటిష్ఠ బందోబస్తు నడుమ అధికారులు తరలించారు.

వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ పరిధిలోని చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి, మొగుళ్లపల్లి, రేగొండ, గోరికొత్తపల్లి, గణపురం మండలాల్లో మొత్తం 329 మంది ఓటర్లు ఉండగా 308 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 93.62 శాతం పోలింగ్ నమోదైంది. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలకు భూపాలపల్లి జిల్లా పరిధిలో కాటారం, మల్హర్, మహాముత్తారం, పలిమెల, మహాదేవపూర్ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో మొత్తం 2,483 మంది పట్టభద్రుల ఓటర్లులుండగా వీరిలో 1,903 మంది ఓటు హక్కు నమోదుచేసుకున్నారు. ఇక్కడ 76 శాతం పోలింగ్ నమోదైంది. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 83 మంది ఓటర్లు ఉండగా 77 మంది ఓటేశారు. ఇక్కడ పోలింగ్ 92 శాతం నమోదైంది.

ఓటు హక్కును పట్టించుకోని ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది. ఇతర వృత్తులకల్లా ఇది ఆదర్శమనే పేరు ఉంది. అయితే.. కొందరు ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయకపోవడం విమర్శలకు తావిచ్చింది. ప్రజాస్వామ్య హక్కును వీరు వినియోగించుకోవడం చర్చనీయాంశమైంది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో ఉన్న భూపాలపల్లి డివిజన్‌లో మొత్తం 329 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోగా వీరిలో 308 మంది మాత్రమే ఓటు వేశారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానం పరిధిలోని కాటారం డివిజన్‌లో మొత్తం 83 మంది ఓటర్లు ఉండగా వీరిలో 77మంది మాత్రమే ఓటేశారు. ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉపాధ్యాయులే ఇలా నిర్లక్ష్యం చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.



భూపాలపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ఉమ్మడి జిల్లాలో 92.95 శాతం పోలింగ్

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా పూర్తయింది. ఉపాధ్యాయులు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటి రెండు గంటల పాటు కాస్త మందకొడిగా సాగిన పోలింగ్ 10 గంటల తర్వాత జోరందుకుంది. అయితే ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన 72 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 11,189 ఓటర్లకు గాను 10,401మంది ఓటు హక్కు వినియోగించుకోగా 92.95శాతం పోలింగ్ నమోదైంది. వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాల్లోని పోలింగ్ స్టేషన్లను సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో పాటు అభ్యర్థులు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పూల రవీందర్, పులి సరోత్తంరెడ్డి, ఎస్.సుందర్‌రాజ్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి తదితరులు సందర్శించారు.

పోలింగ్ జరిగిందిలా..

జిల్లా	మొత్తం ఓట్లు	పోలయినవి	శాతం
వరంగల్	2,352	2,214	94.13
హనుమకొండ	5,215	4,780	91.66
జనగామ	1,002	945	94.31
మహబూబాబాద్	1,663	1,571	94.47
భూపాలపల్లి	329	308	93.62
ములుగు	628	583	92.83
మొత్తం	11,189	10,401	92.95



కాటారంలో మొదటిసారి ఓటు వేసిన పట్టభద్రులు



మహాముత్తారంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న పట్టభద్రులు



భూపాలపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

దుస్తులు అమ్ముకుని తిరిగివస్తూ..

- రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి
- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ
- మల్లంపల్లి మండలం దేవనగర్ క్రాస్‌రోడ్డు వద్ద ఘటన





మృతులు మహబూబ్, సకీనా (ఫైల్)

ములుగు కలెక్టరేట్/ఖానాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వారు ఊరూరూ తిరుగుతూ బట్టలు అమ్ముకుంటూ పొట్టనింపుకునే వారు. వృత్తిలో భాగంగా రోజుల తరబడి గ్రామగ్రామానా తిరుగుతూ బట్టలు విక్రయిస్తూ ఉంటారు. ఈ క్రమంలో వ్యాపారం చేసుకుని తిరిగి వస్తుండగా.. మృత్యువు రూపంలో వచ్చిన లారీ.. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం దేవనగర్ క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం..

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన షేక్ సకీనా(42), మహబూబ్(55) భార్యాభర్తలు. వీరు తమ టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్‌పై ఊరూరు తిరుగుతూ రెడీమేడ్ దుస్తులు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. దుస్తుల విక్రయం కోసం నెలల తరబడి సుదూర

మిగతా 8వ పేజీలో...



ప్రమాదానికి కారణమైన లారీ

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- వన్యప్రాణిని తప్పించబోయి చెట్టును ఢీకొన్న కారు





ప్రమాదానికి గురైన కారు, మృతుడు బోల్లా ప్రసాద్(ఫైల్)

తాడ్వాయి/మంగపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణిని తప్పించబోయి కారు అదుపు తప్పి వ్యాపారి దుర్మరణం చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన తాడ్వాయి మండలంలోని మొండ్యాలతోగు అటవీ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగపేట మండల కేంద్రానికి చెందిన వ్యాపారి బోల్లా ప్రసాద్ (46) తన ముగ్గురు మిత్రులు సిద్ధశెట్టి శ్రీనివాస్, గుర్రం వెంకటేశ్, ఎన్.సుబ్బారావు శర్మతో కలిసి మహాశివరాత్రి సందర్భంగా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయాన్ని సందర్శించి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. కారును ప్రసాద్ డ్రైవ్ చేస్తున్న క్రమంలో మార్గ మధ్యలో వన్యప్రాణి అడ్డంగా వచ్చింది. దానిని తప్పించబోయి కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జు కాగా ప్రసాద్ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా వారిని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రసాద్ మృతదేహానికి ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. గాయపడిన ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో ములుగు ఏరియా ఆస్పత్రి నుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రముఖ వ్యాపారిగా ప్రసాద్ మంగపేట మండల ప్రజలకు సుపరిచితుడు. క్షతగాత్రుల్లో సుబ్బరావుశర్మ విద్యుత్ శాఖలో ఈఈ కాగా, శ్రీనివాస్ కూడా వ్యాపారం రంగంలో ఉన్నారు. మరో క్షతగాత్రుడు వెంకటేశ్ ఇటీవల చదువు పూర్తి చేసుకున్నాడు. ప్రసాద్ మృతితో మంగపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి సంతాప సూచికంగా మంగపేట వ్యాపారులు బంద్‌ను పాటించారు.

పోతుగల్లు చెక్‌డ్యామ్‌కు గండి

- నాటు బాంబులతో ధ్వంసం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చిట్యాల/మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మొగుళ్లపల్లి మండలంలోని పోతుగల్లు- చిట్యాల మండలం నవాబుపేట గ్రామాల మధ్య చలివాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గండిపెట్టారు. నాటు బాంబులు అమర్చి ధ్వంసం చేశారు. ఈ చెక్‌డ్యామ్‌ను రెండేళ్ల క్రితం రూ. 10 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాంను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నాటుబాంబులు అమర్చి ధ్వంసం చేశారు. వాగులో నిల్వ ఉన్న నీరంతా దిగువకు వృథాగా వెళ్లిపోతోంది. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఈఈ ప్రసాద్, చిట్యాల డీఈ ఆమ్రపాలి, ఏఈలు వరుణ్, భాస్కర్ చెక్‌డ్యామ్‌ను సందర్శించి గండిని పరిశీలించారు. అనంతరం మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిదర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై బి.అశోక్ తెలిపారు.

తాత్కాలిక మరమ్మతులు

నవాబుపేట-పోతుగళ్ల చలివాగుపై చెక్‌డ్యామ్‌కు గండి పెట్టారనే విషయం తెలుసుకున్న చిట్యాల, నవాబుపేట, ఎలేటిరామయ్యపల్లి, మొగుళ్లపల్లి మండలం అంకుశాపురం, బద్దంపల్లి రైతులు అక్కడికి చేరుకొని ఇరిగేషన్ అధికారులతో కలిసి నీటిని ఆపే ప్రయత్నాలు చేశారు. తాత్కాలికంగా ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. వర్షాకాలంలోపు చెక్‌డ్యాం గండి ప్రదేశంలో శాశ్వత మరమ్మతు పనులు చేపడుతామని ఇరిగేషన్ ఈఈ ప్రసాద్ తెలిపారు.

ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు

పంట చివరి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చెక్‌డ్యామ్‌ను నాటు బాంబులతో పేల్చడం హేయమైన చర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసంగి పంటలకు సరిపడా సాగునీరు అందించాలని అధికారులను వేడుకున్నారు. నిందితులను గుర్తించి కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే టేకుమట్ల మండలంలోని పలు గ్రామాల రైతులు చెక్‌డ్యామ్‌ను గండి కొట్టినట్లు ప్రచారం జరుగుతోంది. పలుమార్లు సాగునీటి సమస్యపై స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతోపాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజును కలిసి హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్ల నాగారం చెరువు నుంచి నీటిని విడుదల చేసి వరి పంటలను కాపాడాలని రైతుల విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యేలు స్పందించి వరిపంటల కోసం నీటిని విడుదల చేశారు.నీళ్లు కిందిభాగాన వెళ్లకపోవడంతో రైతులు తమ పంటలు ఎండిపోతున్నాయనే ఉద్దేశంతో చెక్‌డ్యామ్‌కు గండి కొట్టినట్లు తెలుస్తోంది.



గండి నుంచి వృథాగా పోతున్న నీరు



నాటు బాంబులు అమర్చిన ఆనవాళ్లు

గుండం శివాలయాన్ని అభివృద్ధి చేస్తా

● జాతరలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తా ● పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండం పురాతన శివాలయాన్ని దేవాదాయ శాఖ సహకారంతో అభివృద్ధి చేస్తానని, జాతరలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తానని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. గుండం శివాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. పూజారులు, దేవస్థాన కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా శివలింగానికి మంత్రి పూజలు చేశారు. అనం తరం మాట్లాడుతూ కాకతీయుల కళాసంపద, సాంస్కృతిక, సంప్రదాయంలో భాగంగా ఉన్న గుండం శివాలయానికి పూర్వ వైభవం తీసుకువస్తానని పేర్కొన్నారు. శివాలయానికి కొత్తగూడ, గంగారం, నర్సంపేట, గూడూర్, నల్లబెల్లి మండలాల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్య లో తరలివచ్చి శివ, పార్వతులను, రామక్కను దర్శించుకుంటారని పేర్కొన్నారు. ప్రజలకు శివపార్వతులు దీవెనలు ఉండాలని కోరారు. ప్రజలు సుఖ, సంతోషాలతో, పంటలు పండాలని కోరుకున్నారు. రాబో యే జాతరలోపు అన్ని గ్రామాల నుంచి గుండం శివాలయానికి వచ్చేరోడ్లను మరమతు చేయిస్తానన్నారు. ప్రస్తుతం జాతరలో గుండం చెరువు వద్ద స్నానఘట్టాలు, షెడ్ నిర్మించేందుకు రూ.25 లక్షల నిధులు మం జూరు చేసి, అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. కాగా, గుండం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని సీతక్క పరామర్శించారు. ప్రజలు పలువురు వారి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మాజీ జడ్పీటీసీలు కారోజు రమేష్, మధుసుదన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యాక్షుడు కర్ర జనార్దన్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.


గుండం శివాలయంలో పూజలు చేస్తున్న సీతక్క

చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో ఉద్యమించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో యువత సమరశీల పోరాటాలుచేస్తూ ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నందీశ్వర్ అన్నారు. గురువారం దేశం కోసం అమరుడైన మహనీయుడు చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 సంవత్సరాల వయసులోనే బ్రిటీషు నిరంకుశ పాలన విధానాలను వ్యతిరేకించి పోరాడిన గొప్ప దేశభక్తిగల నేతని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, సిద్ధు, నవీన్, మహేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రామప్పను దర్శించిన అమెరికా కౌన్సిల్ జనరల్


రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న జెన్నిఫర్ లార్సన్

వెంకటాపూర్, ఫిబ్ర వరి 27 (ఆంధ్ర జ్యోతి): ములుగు జిల్లా వెంకటా పూర్ మండల ంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప రామ లింగేశ్వరస్వామి దేవాల యాన్ని అమెరి కా కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ గురు వారం సందర్శించారు. మహా శివరాత్రి ఉత్సవాల సంద ర్భంగా ఆమె రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆమె తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె ఆలయ శిల్పకళా సంపదను వీక్షించారు. గైడ్ ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టతను అడిగి తెలుసు కున్నారు. ఆమె వెంట ఆర్డీవో వెంకటేశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం అధికారి లోకేష్, స్థానిక ఎస్సై జక్కుల సతీష్ తదితరులు ఉన్నారు.

నాలుగు రోజులుగా రాని మిషన్ భగీరథ నీరు

● తాగునీటికి ఇబ్బందులు పడుతున్న చక్రుతండా గిరిజనులు

గూడూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలంలోని చక్రుతండాలో గత నాలుగు రోజులుగా తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోవడంతో గిరిజనులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. తండాలో దాదాపు 500 పై చిలుకు జనాభా ఉంది. మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడి ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు నీటి సరఫరాను క్రమం తప్పకుండా అందించాలని విజ్ఞప్తి చేశారు.



గూడూరు మండలం చక్రుతండాలో తాగునీటి కష్టాలు

పులి సరోత్తమ్‌రెడ్డి గెలుపు ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్ రెడ్డి


కొత్తగూడలో ఓటర్ స్లిప్ అందజేస్తున్న గుగులోత్ స్వరూప

తొర్రూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్- ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో పులి సరోత్తమ్‌రెడ్డి గెలుపు ఖాయమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మూడు స్థానాల్లో విజయఢంకా మోగిస్తుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు, ఉపాధ్యాయ, ఉద్యోగులకు అమలుకాని హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి ఫలితం ఈ ఎన్నికల్లో తప్పదన్నారు. 317జీవో వల్ల ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయుల పక్షాన బీజేపీ ఎనలేని పోరాటం చేసిందని, వారి మద్దతు బీజేపీ అభ్యర్థులకే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లేగ రాంమోహన్‌రెడ్డి, నాగరాజు, శ్రీమాన్, శివరాజ్, రాజేష్, పల్లె కుమార్, కొలుపుల శంకర్, ఆర్.కుమార్, రాంబాబు, సురేష్, శేఖర్, నవీన్, యాకయ్య, సంతోష్ పాల్గొన్నారు.

పులి సరోత్తంరెడ్డి గెలుపు ఖాయం

కొత్తగూడ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరచిన పులి సరోత్తంరెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటుతోనే విజయం సాధిస్తాడని బీజేపీ రాష్ట్ర నాయకురాలు గుగులోత్ స్వరూప పేర్కొన్నారు. కొత్తగూడలో పోలింగ్ సరళిని వివరాలను బీజేపీ రాష్ట్ర నాయకురాలు గుగులోత్ స్వరూప నాయకులు నుంచి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కొట్లాడిన పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి మురళి, జిల్లా నాయకులు వాసం సారయ్య, వాసం మునీందర్, గుగులోత్ స్వామినాయక్, ప్రధాన కార్యదర్శులు తోటకూరి మధు, బోనాల ప్రవీణ్ చారి, నాయకులు వజ్జ రవి, కొట్టె శ్రీనివాస్, జాడీ అశోక్, మామిడి యాకయ్య, పెనుక రామయ్య, భూర్క సారంగపాణి, భూపాల్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు
మండల సంఘం ఎన్నిక


శ్రీనివాస్, శోభన్, చందు

ఇనుగుర్తి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండల తొలి మున్నూరుకాపు సంక్షేమ సంఘం కమిటీని గురువారం సంఘం జిల్లా కార్యదర్శి చందా గోపి, కేసముద్రం మండల అధ్యక్షుడు కముటం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ గౌరవ అధ్యక్షునిగా వద్దిరాజు కిషన్, అధ్యక్షునిగా పింగిళి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మామిడి శోభన్, కోశాధికారిగా ఆది చందు, ఉపాధ్యక్షులుగా బొర్ర శ్రీనివాస్, బండి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా ముత్యాల మల్లయ్య, గుండ్ల శరత్, ఆడిట్ కమిటీ సభ్యులుగా కావటి రవీందర్, గౌరవ సలహాదారులుగా రాయలి ఉప్పలయ్య, నాగేశ్వర్, గుండ్ల వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా నవనందుల శ్రీనివాస్, బండి ప్రవీణ్, మట్టపల్లి అశోక్, బొల్లు సంపత్, శీర్ శ్రీనివాస్, కామినేని సురేష్, ముత్యాల రమేష్, హరీష్‌లను ఎన్నుకున్నారు.

ఒక్క ఓటుతో వంద శాతం పోలింగ్


ఓటు హక్కును వినియోగించుకున్న ఉపాధ్యాయ సుధాకర్

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పలిమెల మండలంలో ఒకే ఒక్క ఓటు పోలవ్వడంతో వంద శాతం పోలింగ్ నమోదైంది. ఆ ఒక్క ఓటు కోసం ఐదుగురు పోలింగ్ సిబ్బంది, ఒక రూట్ ఆఫీసర్, భద్రతకు ఇద్దరు పోలీసులు పర్యవేక్షించగా ఉపాధ్యాయుడు జాడి సుధాకర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలిమెల మండల వ్యాప్తంగా పదికి పైగా పాఠశాలలు ఉన్నప్పటికీ ఇక్కడ అన్ని ప్రైమరీ పాఠశాలలే ఉన్నాయి. పంకెనలో ఒకే ఒక్క అప్పర్ ప్రైమరీ స్కూల్ (యూపీఎ స్) ఉండగా అందులో ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదయ్యాడు. ఆయన ఒక్కరి కోసం ఐదుగురు పోలింగ్ సిబ్బంది, ఒక రూట్ ఆఫీసరు, భద్రత పరంగా ఇద్దరు పోలీసు లను కేటాయించారు. గురువారం పోలి ంగ్ జరగ్గా ఆ ఒకే ఒక్కడు టీచర్ సుధాకర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన ఉదయం 10.30 గంటలకు ఓటు వేయగా వంద శాతం పోలింగ్ నమోదైన కేంద్రంగా పలిమెల మొదటి వరుసలో నిలిచింది. పోలింగ్ నిబంధన ప్రకారం సాయంత్రం వరకు వేచి ఉన్న సిబ్బంది 4 గంటల తర్వాత పోల్ బాక్స్‌ను స్ట్రాంగ్ రూంకు తరలించారు.

బహుజనవాదం గెలవబోతోంది


సమావేశంలో మాట్లాడుతున్న పూల రవీందర్

తొర్రూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనవాదం గెలువబోతుందని ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. గురువారం తొర్రూరులో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించి ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మూడు జిల్లాల బీసీ ఉపాధ్యాయులు ఐక్యత చాటారని, ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురిచేసేందుకు పలువురు అభ్యర్థులు యత్నించారని, వారికి ఓటుతో బుద్ధిచెప్పారన్నారు. సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు, నేషనల్ ఇంక్రిమెంట్ల మంజూరీకి తాను ఎన్నికల్లో గెలువగానే కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీగా ఉన్నపుడు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశానని, కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు మెటర్నిటీ లీవ్‌లు, చైల్డ్‌కేర్, బదిలీలు, పదోన్నతులను షెడ్యూల్‌లోకి తీసుకురావడం, పదవీ విరమణ వయసు పెంపులో తన పాత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుధాకరాచారి, యాకయ్య, శ్రీనివాస్, యాకూబ్ రెడ్డి, చంద్రప్రకాశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు యాప సీతయ్య

మరిపెడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు యాప సీతయ్య అన్నారు. గురువారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించి స్థానిక విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ కార్యక్రమంలో ధర్మారపు వెంకన్న, భూక్యా కాంతమ్మ, గంగాధర్, లింగంనాయక్, పులి శ్రీనివాస్, సుధాకర్, బింగి రమేశ్, బాస్కర్, హుస్సేన్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వరంగల్-2 డిపోలో శుక్రవారం నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ములుగు ప్రాంత ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం వి.జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని, సలహాలు, సూచనలు, పలు సమస్యలను 99592 26048 నంబర్‌కు తెలియపరచాలని ఆమె కోరారు.

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో సందడి గురువారం అధికంగా నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి వనదేవతలు సమ్మక్క- సారలమ్మలను దర్శించుకున్నారు. తల్లుల గద్దెలకు పూలు, పండ్లు, పసుపు, కుంకమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, ఎత్తుబంగారం, యాట మొక్కులను సమర్పించుకున్నారు. ఐదు వేల మందికి పైగా అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

ప్రసాదానికి నోచుకోని భక్తులు

మేడారంలో వనదేవతల ప్రసాదం ఇవ్వండంటూ భక్తులు వేడుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తల్లులలను దర్శించుకుంటున్నా ప్రసాదం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తులు సమర్పించే నైవేద్యాలను పూజారులు ప్రసాదంగా ఇవ్వడం లేదని అంటున్నారు. దేవాదాయ శాఖ అధికా రులు ఇప్పటికైనా స్పందించి ప్రసాదం అందేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

క్రైం కార్నర్

అప్పుల బాధతో మిర్చి రైతు ఆత్మహత్య


బండారి రవి (ఫైల్)

రేగొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో మిర్చి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బండారి రవి (54) తనకున్న రెండెకరాల భూమిలో మిర్చి పంట వేశాడు. నల్లి సోకడంతో పంట దిగుబడి సరిగారాక నష్టపోయాడు. దీంతో పెట్టుబడికి తెచ్చిన రూ. 5 లక్షల అప్పును తీర్చలేక మనస్తాపంతో తన తోట వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన తోటి రైతులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకొని రవిని పరకాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స అంది స్తున్న క్రమంలోనే రవి మృతి చెందాడు. మృతుడికి భార్య వినోద, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

వదినపై దాడి చేసిన కేసులో మరిది అరెస్ట్

కేసముద్రం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తౌర్యతండా జీపీ పరిధిలోని మూలస్తంభంతండాలో బుధవారం సాయంత్రం ఇంటి స్థల వివాదంలో వదినపై కొడవలితో దాడి చేసిన ఘటనలో ఆమె మరిది నూనావత్ రమేష్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఇంటిస్థలం విషయంలో ఈ దాడి జరిగిన విషయం విధితమే. బాధితురాలి భర్త రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ఇనుగుర్తి మండలం కోమటిపల్లి జీపీ పరిధిలోని మూలస్తంభంతండాకు చెందిన నూనావత్ రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

● నలుగురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకతరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగూడూరు ఆకేరువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా జిల్లా కేంద్రానికి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెప్పారు. ఎవరైన అనుమతులు లేకుండ అక్రమంగా ఇసుక తరలిస్తే సహించేది లేదని చెప్పారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను సీజ్ చేసి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్లతో పాటు యాజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెరువు కట్ట పై నుంచి పడి వ్యక్తి మృతి

గార్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వచ్చిన ఓ వ్యక్తి చెరువు కట్టపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన గార్లలో బుధవారం రాత్రి చోటు చేసుకొంది. గురువారం ఎస్సై రియాజ్ పాష తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గార్ల మండల కేంద్రానికి చెందిన అర్వపల్లి శివ పుట్టిన రోజు సందర్భంగా బయ్యారం మండల కేందంలో వైన్స్ షాపులో సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న కత్తి జంపన్న (47)ను వేడుకలకు రావాలని తెలిపాడు. బయ్యారానికి చెందిన జంపన్నతోపాటు మరో ఇద్దరు కలిసి వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపారు. వేడుకలు ముగించుకొని తిరుగు ప్రయాణంలో జంపన్న స్కూటీపై వెళ్లే సమయంలో చెరువుకట్ట అలుగుపై నుంచి జారిపడి 12 అడుగుల లోతులో పడిపోవడంతో జంపన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న స్నేహితులు 108 సహాయంతో మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి తరలిస్తుండగా జంపన్న మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతిడి భార్య శోభ ఫిర్యాదు ఎస్సై రియాజ్ పాష కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


గూడూరులో దగ్ధమవుతున్న ఇల్లు

గూడూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన గూడూరులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు మేరుగు భరత్ తెలిపిన వివరాల ప్రకారం. గూడూరు మండల కేంద్రానికి చెందిన మేరుగు భరత్ సౌండ్ అండ్ డెకరేషన్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో డెకరేషన్, డీజే సామాన్లను తన ఇంట్లోని పెట్టుకున్నాడు. రాత్రి వేళ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు నీటిని తీసుకువచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. అప్పటికే గదిలో ఉన్న డెకరేషన్ సామాన్లతో పాటు ఎల్ఈడీ లైటింగ్, వైర్లు, సౌండ్ సిస్టం, ఇతరత్రా వస్తువులు పూర్తిగా కాలిపోయియి. దీంతో భరత్‌కు సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో తాను ఉపాధి కోల్పోయాయనని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు


గాయపడిన క్షతగాత్రులు

మరిపెడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆటో బోల్తా పడి ముగ్గురు గాయపడిన సంఘటన గురువారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ఎన్‌హెచ్ 365పై స్థానిక బొమ్మరిల్లు హోటల్ దగ్గర చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మండలంలోని చిల్లంచర్ల రెవెన్యూ పరిధి లచ్చిరాంతండాకు చెందిన భూక్యా అనిత, కౌసల్య, విజేందర్ అదే తండాకు చెందిన ఓ ఆటోలో కురవి టెంపుల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. క్షతగాత్రులను బంధువులు మరిపెడ పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని బాధితులు ఆరోపించారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కొరిపెల్లి గ్రామానికి చెందిన అనారోగ్యంతో మట్టిపల్లి మహేష్(29) మరణించగా మృతదేహానికి, జంపాల బాలమ్మ మృతి చెందగా చిత్రటానికి పూలమాల నివాళులర్పించారు అనంతరం మృతుల కుటంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని యూత్ నాయకులను కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, శ్రీరాం సంజయ్, కనుకుంట్ల వెంకన్న, జ్ఞానేశ్వరచారి, ముజీపుద్దీన్, ఆరుట్ల వెంకన్న, కృష్ణారెడ్డి, భీమ్లానాయక్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

సోమసూత్రం మరమ్మతుకు సహకరిస్తాం

- వరల్డ్ హెరిటేజ్ సైట్ సభ్యుడు పాపారావు

వెంకటాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమసూత్ర మరమ్మతుల కోసం తాము ప్రయత్నిస్తామని వరల్డ్ హెరిటేజ్ సైట్ సభ్యుడు పాపారావు తెలిపారు. గతంలో సోమసూత్రానికి తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ భక్తులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాలేకపోయామని పేర్కొన్నా రు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం దేవాదాయ శాఖతో సమన్వయంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో తమకు లేఖ అందాక కేంద్ర పురావస్తు శాఖను సంప్రదిస్తామని, సోమసూత్రానికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు తాము సిద్ధమని వివరించారు. మహాశివరాత్రి పర్వదినాన అభిషేకాల సమయంలో భక్తులకు ఇబ్బంది కలగడం పట్ల ఆయన విచారం వ్యక్తంచేశారు.

నేటి నుంచే సాంస్కృతికోత్సవం

- స్ప్రింగ్ స్ప్రీ-2025కు ముస్తాబైన నిట్
- ముఖ్య అతిథిగా రానున్న ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం
- ఆకట్టుకోనున్న పలు ఈవెంట్లు.. అలరించనున్న ప్రో షోలు



మీడియాతో మాట్లాడుతున్న వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ

హనుమకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎన్ఐటీలో ప్రతిష్ఠాత్మకమైన సాంస్కృతికోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ)-2025 ఈనెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నట్టు వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. గురువారం నిట్ క్యాంపస్‌లోని సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్ప్రింగ్ స్ప్రీకి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు తెలిపారు. స్ప్రింగ్ స్ప్రీ మొదటి రోజు 28వ తేదీన సుప్రసిద్ధ హాస్యనటుడు గిన్నీస్ వరల్డ్ రికార్డు హోల్డర్, పద్మశ్రీ డాక్టర్ కె.బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. విద్యార్థులతో ఇష్టాగోష్టిగా మాట్లాడతారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారు. సందేహాలను నివృత్తి చేస్తారని చెప్పారు. రెండో రోజు ఇండియన్ రాక్ బ్యాండ్ వోర్టెక్స్ ఉంటుంది. వోర్టెక్స్ అనేది జానపద, రాక్, ప్రత్యామ్నాయ సంగీతాల ప్రత్యేక కలయిక. ప్రసిద్ధి చెందిన భారతీయ బ్యాండ్ మొదటిసారి ప్రదర్శిస్తున్నారు. ఈ సాంస్కృతికోత్సవంలో భాగంగా రెండు సినిమా బృందాలు కూడా విద్యార్థులతో నిర్వహించే ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొంటాయన్నారు. మూడోరోజు ప్రముఖ భారతీయ గాయకుడు అమిత్ త్రివేది సంగీత విభావరి నిట్ స్టేడియంలో ఉంటుంది. సంగీతం, కాస్ప్లే, డిజైనింగ్, గేమింగ్, ఫిల్మ్ మేకింగ్, సోలో డ్యాన్స్, హిస్పోల్ క్విజ్, స్ట్రీట్ బాటిల్, నుక్కడ్, సైలెంట్ డీజేలలో పోటీలు, సినిమాలు, సాహిత్యంపై చర్చాగోష్ఠి, వర్క్‌షాపులను కూడా నిర్వహిస్తారని, బైక్ స్టంట్స్, మ్యాజిక్ షో వంటి అద్భుత ప్రదర్శనలు కూడా ఉంటాయని, వీటితో పాటు వినోదభరితమైన, ఆకర్షణీయమైన కార్యకలాపాలతో క్యాంపస్ అంతా ఈ మూడు రోజులు సందడిగా ఉంటుందన్నారు.

అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవం

వరంగల్ ఎన్ఐటీలో నిర్వహించే స్ప్రింగ్ స్ప్రీ దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద సాంస్కృతికోత్సవాల్లో ఒకటిగా పేర్కొన్నారు. దేశంలోని దాదాపు అన్ని ఎన్ఐటీల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యే ఈ సాంస్కృతికోత్సవం ఆనందించే, మేధోపరంగా ఉత్తేజపరిచే వివిధ ఈవెంట్ల సమాహారం. ఆదర్శ సమ్మేళనంగా ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అభివర్ణించారు. ఈ ఉత్సవంలో భాగంగా ఆకట్టుకట్టుకునే ప్రోషోలతోపాటు ఆహ్లాదకరమైన, సృజనాత్మకమైన ఎన్నో కళాప్రదర్శలు, పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు, వీక్షకులకు జీవితకాలం మరిచిపోని అనుభూతిని ఇస్తుందన్నారు. స్ప్రింగ్ స్ప్రీలో భాగంగా కళ, సాహిత్యం, నాటకం, నృత్యం, సంగీతం, క్విజింగ్, ఫొటోగ్రఫీ, పెయింటింగ్, ఫ్యాషన్ షోలు, రాక్ మ్యూజిక్, మోడల్ యునైటెడ్ నేషన్స్, మినిట్ మెయిడ్ తదితర అంశాల్లో పోటీలు, ప్రదర్శనలు ఉంటాయన్నారు. స్ప్రింగ్ స్ప్రీ ప్రధానంగా ఏటా క్రమం తప్పకుండా నిర్వహించే ఇంటర్ కాలేజీయేట్ సాంస్కృతిక ఉత్సవం. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు వివిధ కళల్లో ప్రతిభను చాటేందుకు తమను తాము వ్యక్తీకరించుకునేందుకు వేదికగా నిలుస్తుందని ప్రొఫెసర్ సుబుధి తెలిపారు.

కొత్త ఈవెంట్లు, సరికొత్త కళారూపాలు

కొత్త ఈవెంట్లను ప్రోత్సహించడం, సరికొత్త కళారూపాలను ప్రదర్శించడం ఈ యేడు స్ప్రిం గ్ స్ప్రీ ప్రత్యేకతగా ఉండబోతోందన్నారు. స్ప్రిం గ్ స్ప్రీలో భాగంగా నిర్వహించే ప్రోషోలలో జాతీయం, అంతర్జాతీయంగా పేరెన్నికగన్న కళాకారులు తమ ప్రదర్శనలు ఇస్తారన్నారు. స్పాట్ లైట్ ఈవెంట్లు విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని ఇవ్వడమే కాకుండా విద్యార్థుల్లో నిబిడీకృతమై ఉన్న శక్తిని మరోస్థాయికి తీసుకువెళతాయని చెప్పారు. కొరియో నైట్స్, డైరెక్టర్ కట్స్, ఎన్ఐటీ డబ్ల్యూ ఐడల్, అల్లూర్, దివార్ ఆఫ్ ది డీజేలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయని, స్ప్రింగ్ స్ప్రీ సందర్భంగా నిర్వహించే ప్రోషోల్లో ప్రఖ్యాత కళాకారులే కాకుండా, విద్యార్థులు పాల్గొంటారని, ఇవి వరంగల్ ప్రజలను సైతం విశేషంగా ఆకట్టుకోనున్నాయన్నారు. ఈ విలేకరు ల సమావేశంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, కల్చరల్ సొసైటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి.శ్యాం ప్రసాద్, కల్చరల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బి.శ్రీనివాస్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) ప్రతినిధి రణధీర్, సాక్ టెక్నికల్ సొసైటీ ప్రతినిధి ఇషాన్ శర్మ, సాక్ స్పోర్ట్ సొసైటీ ప్రతినిధి అథర్వ దేశ్‌పాండే, సాక్ ఫిల్మ్ అండ్ మ్యూజిక్ సొసైటీ ప్రతినిధి జి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అలరించనున్న ఈవెంట్లు

• స్ప్రింగ్ స్ప్రీలో వినూత్న ప్రదర్శనలు • మూడు రోజులు సందడే సందడి



హనుమకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎన్ఐటీలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న స్ప్రింగ్ స్ప్రీ-2025లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించే వివిధ ఈవెంట్లు, పోటీలు, ప్రదర్శనలు, సంగీత, సాహిత్య కార్యక్రమాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

మొదటి రోజు

ఈనెల 28వ తేదీన మొదటి రోజు మధ్యాహ్నం 2గంటలకు స్ప్రింగ్ స్ప్రీ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ హాస్యనటుడు పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మానందం హాజరవుతున్నారు. ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాత్రి 8.30 గంటలకు నిట్ క్యాంపస్‌లోని ఆడిటోరియంలో కళ్లుచెదిరిపోయే రీతిలో పాతకొత్త పాటల కలయికగా ఆస్ట్రేలియా పేరుతో నిర్వహించే ఈ సంగీత విభావరి విద్యార్థులను ఉర్రూతలూగించనున్నది. విద్యుత్ కాంతుల వెలుగుల్లో ఆస్ట్రేలియా ఆద్యంతం ఆకట్టుకోనున్నది.

రెండో రోజు

స్ప్రింగ్ స్ప్రీ రెండో రోజు (మార్చి 1న) ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించే ఈవెంట్లలో కొరియోనైట్, డ్యాన్స్ రష్, హిప్‌హాప్, యాస్త్రోమానికా, ఆర్ట్ థియేటర్, ట్రెజర్ హంట్, ఇంప్రెషన్ ఆఫ్ యూనిటీ, వరంగల్ ఎన్ఐటీ ఐడల్, యోధోంకి భారత్, సునీసునియే, సోలో ఇన్‌స్ట్రుమెంట్స్, ఇకిగియా, అన్‌సాల్వ్‌డ్, థియేటర్ ఆర్ట్, హస్తకళ, తానాబానా, డ్యాన్స్ రష్ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

మూడో రోజు

స్ప్రింగ్ స్ప్రీ మూడో రోజు (మార్చి 2) నిర్వహించే ఈవెంట్లలో నుక్కడ్ నాటక్, ఎస్కేప్ ద గ్రిడ్, పోలరైడ్ ఫొటోగ్రఫీ, హ్యాండ్ ప్రింటింగ్, ఫిల్మ్‌హంట్, ఫిల్మ్‌హౌస్, రీల్ క్రియేషన్, బ్లిట్జ్ బులెట్ టీం ఎరెనా, థింక్ డ్రాప్ రివీల్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ కాంటెస్ట్, పోటరీ మేకింగ్, క్యూఫ్యాక్టర్ జనరల్ క్విజ్, క్యూఫ్యాక్టర్ మైథాలజీ క్విజ్, బ్లిజ్‌క్రిగ్ చెస్ తదితర ఈవెంట్లు ఉంటాయి. ఈ ఈవెంట్లలో పాల్గొని విజేతలైన వారికి నగదు బహుమతులు ఉంటాయి. స్ప్రింగ్ స్ప్రీ చివరి రోజు నిర్వహించే ఫ్యాషన్ పరేడ్ విశేంగా ఆకట్టుకోనున్నది.

దర్జా కోల్పోతున్న దర్జీలు

రెడీమేడ్ వస్త్రవ్యాపారం జోరుతో టైలర్ల ఉపాధికి గండి



నేడు ప్రపంచ దర్జీల దినోత్సవం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు దర్జీ (మేరు కులస్తులు)టైలర్ షాపులను నిర్వహిస్తూ దర్జాగా జీవనం గడిపేవారు. పండగలు, పెళ్ళిళ్ల సమయం వస్తున్నాయంటే వారికి విరామం దొరకని పరిస్థితి. ప్రస్తుతం ప్రజలు వస్త్రాల కొనుగోలుపై ఆసక్తి చూపకుండా రెడీమేడ్ దుస్తులకే ప్రాధాన్యత ఇస్తుండటంతో దర్జీల కుల వృత్తి టైలరింగ్‌లో పని దొరక్క అర్ధాకలితో అలమటిస్తున్నారు. లండన్ దేశానికి చెందిన థామస్ సెయింట్ అనే ఆంగ్లేయుడు 1790లో మొట్టమొదటగా కుట్టు యంత్రం (మిషన్)కు రూపకల్పన చేశారు. దీంతో దర్జీ కులస్తులు కుట్టు మిషన్ల ద్వారా టైలర్ షాపులను ఏర్పచుకొని బట్టలు కుడుతూ తరతరాలుగా జీవనం కొనసాగిస్తున్నారు. శుక్రవారం ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

సంప్రదాయక పండగలు, శుభకార్యాలు వస్తున్నాయంటే బట్టల దుకాణానికి వెళ్లి ప్రజలు తమకు నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేసి మరుసటి రోజే వాటిని దర్జీ (టైలర్)లకు కుట్టడానికి ఇచ్చేవారు. పండుగల వేళ పోటీ పడి మరీ టైలర్ షాపుల వద్దకు జనాలు తిరిగే కళాత్మక టైలరింగ్ వ్యవస్థ నేడు కుదేలైంది. రెడీమేడ్ వస్త్ర వ్యాపార వ్యవస్థ పరిధిని విస్తృతం చేసుకోవడంతో టైలరింగ్ కొందరికి మాత్రమే పరిమితమైంది. నాడు ప్రత్యేక కొలతలతో రెడీమేడ్ వస్త్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తమ బట్టలను టైలర్ వద్దే కుట్టించుకునేవారు. పండగలు పెళ్ళిళ్ల సమయంలో బట్టలు కుట్టాలంటే సుమారు నెల ముందే కొలతలు ఇచ్చి ఫలానా తేదీ వరకు కావాలని చేప్పేవారు. అయితే సమాజంలో వచ్చిన పెను మార్పుల వలన బహుళజాతి కంపెనీల రెడీమెడ్ దుస్తులు మార్కెట్‌లోకి తీసుకురావడంతో టైలర్ షాపులపై ప్రభావం మొదలైంది. ఒకప్పుడు కేవలం హైదరాబాద్, వరంగల్ లాంటి పెద్ద పెద్ద నగరాలకు పరిమితమైన రెడీమేడ్ వస్త్ర వ్యాపారం ప్రస్తుతం మండల, గ్రామ స్థాయికి విస్తరించాయి. అదే విధంగా మరో పక్క ఆన్‌లైన్‌లో దుస్తుల అమ్మకాల జోరు రోజు రోజుకూ అధికం కావడం, డ్రెస్ మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో సంప్రదాయక కుట్టుమిషన్ల వ్యవస్థ నీరు గారే పరిస్థితికి వచ్చింది. దీంతో చాలామంది వృత్తిదారులు, టైలర్‌షాపుల యజమానులు, కార్మికులు బతుకులు వెళ్లదీయడంలో ఇబ్బందులు పడుతున్నారు. టైలరింగ్‌ను కులవృత్తిగా ఎంచుకునే ఏండ్ల తరబడి జీవన కొనసాగిస్తున్న తమకు ఇతర కులస్తులకు ఇస్తున్న విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాతో పాటు, ప్రభుత్వ హాస్టల్లు, స్కూల్ విద్యార్థుల యూనిఫారాలు దర్జీలు కుట్టే అవకాశం కల్పించి ఉపాధిని అందించి ఆదుకోవాలని పలువురు మేరు కులస్తులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

టైలర్లకు తగ్గిన గిరాకీ

వివిధ రకాలైన కొలతలతో విస్తృతమైన మార్కెటింగ్ వ్యవస్థతో రెడీమేడ్ బట్టల వ్యాపారం పల్లెల్లోకి రావడంతో ప్రజలు ఎక్కువగా రెడీమేడ్ వైపే దృష్టి సారిస్తున్నారు. రెడీమేడ్ షాపుల్లో త్వరితగతిన కుట్టిన బట్టలు వివిధ మాడల్స్ జీన్స్‌తోపాటు కొత్త కొత్త రకాల బ్రాండ్ల కంపెనీల దుస్తులు చూపించే షాపులు అందుబాటులోకి రావడంతో సంప్రదాయక కుట్టు మిషన్ విధానం వైపు మొగ్గు చూపడం లేదు. సంప్రదాయక టైలరింగ్‌కు పెట్టే ఖర్చు కంటే రెడీమేడ్ బట్టలు కొంత మేరకు చౌకగా లభించడంతో ప్రజలు ఆర్థిక పరిస్థితిలకు అనుగుణంగా రెడీమేడ్ వైపే ఆసక్తి చూపుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



ఏళ్ల తరబడి టైలర్ రంగాన్ని కుల వృత్తిగా ఎంచుకొని దుస్తులు కుడుతూ జీవనం కొనసాగిస్తున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు రెడీమేడ్ వస్త్రాలపై ఆసక్తి చూపించడంతో గిరాకీ లేక తీసుకున్న షటర్ల అద్దెలు కట్టలేని స్థితిలో ఉన్నాం. రోజురోజుకూ డ్రెస్ మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో డ్రెస్సులు కుట్టేందుకు కొంచెం ధరలు పెంచడంతో తమ వద్దకు వచ్చే కస్టమర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర కుల సంఘాలకు అందిస్తున్నట్లుగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కుట్టు మిషన్లు కొనుగోలు చేసేందుకు సబ్సిడీ రుణాలు అందించడంతో పాటు ప్రభుత్వ స్కూల్ యూనిఫారాలు కుట్టే పనిని వృత్తిదారులకు అప్పగించి ఆదుకోవాలి.

తాళ్ల సంపత్‌కుమార్,
విన్ టైలర్ నిర్వాహకుడు హనుమకొండ

30 ఏళ్లుగా టైలర్ రంగంలో ఉన్నా..



30 ఏళ్లుగా టైలర్‌గానే జీవితాన్ని గడుపుతున్నా. ఎంతో మంది రాజకీయ, ఉద్యోగ అధికారుల, విద్యార్థుల, ఇతరుల బట్టలు కుట్టాను. పెళ్లిళ్లు పండగలు వచ్చాయంటే భోజనం చేసే తీరిక లేకుండా వచ్చిన వారికి డ్రెస్సులు కుట్టించి అందించేది. నేడు రెడీమేడ్ వస్త్ర వ్యాపారాలు, వెరైటీ మాడల్స్ దుస్తులను విక్రయించడం, ఆన్ లైన్ షాపింగ్‌లు పెరిగిపోవడంతో దర్జీలకు చేతి నిండా పని లేక, వేరే ఏ పని చేయలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాతలకాలం నుంచి కులవృత్తిగా నమ్ముకొని జీవిస్తున్న దర్జీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోని ప్రోత్సహిం చాలి. గతంలో బట్టలు కుట్టించడానికి తమ షాపుల వద్దకు చాలామంది బారులు తీరేవారు, కానీ నేడు బహుళ జాతి కంపెనీలు వస్త్రరంగంలోకి చొరబడటంతో రెడీమేడ్ బట్టలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆకర్శితులు కావడంతో తమకు ఉపాధి లేకుండా పోతోంది.

గట్ల సురేందర్,
స్మార్ట్ టైలర్, కుమార్‌పల్లి, హనుమకొండ

కన్నులపండువగా పెద్దపట్నం

మల్లన్నకు భక్తుల నీరాజనాలు



సర్వాంగ సుందరంగా వేసిన పెద్దపట్నం



రుద్రాభిషేకం చేస్తున్న వీరశైవార్చకులు

చేర్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్నకు కన్నులపండువగా పెద్దపట్నం రచించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున ఒగ్గుపూజారులు ఆలయ తోటబావి ప్రాంగణంలో యాదవ సంప్రదాయబద్ధంగా మల్లన్న కల్యాణం ఘనంగా జరిపారు. లింగోద్భవ సమయంలో గర్భాలయంలో వీరశైవార్చకులు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పల్లకీసేవ తదితర పూజలు జరిపారు. పట్నం రచించడానికి ముందు ఒగ్గు పూజారులు ఆచారం ప్రకారంగా పట్టువస్త్రాలను గర్భాలయంలో స్వామి వారికి సమర్పించారు. పరమశివుడి తలపై కొలువైన గంగదేవతను కొలిచినట్లుగా యాదవపూజారులు స్వామివారిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లి కోనేటిలో స్నానమాచరింపచేసి శుద్ధిచేసి గంగదీపంపెటి గంగతెప్ప వదిలారు. ఒగ్గు పూజారులసంఘం అధ్యక్షుడు బొద్దుల కనకయ్య నేతృత్వంలో 159మంది ఒగ్గుపూజారులు పట్నంవేసే ప్రదేశంలో సుంకుపట్టిన అనంతరం గొంగళిలో బియ్యంపోసి మైలపోలుతీశారు. స్వామివారు ధరించే త్రిశూలం, ఢమరుకాలను నెలకొల్పి పసుపు, కుంకుమ, తెల్లపిండి(వరిపిండి), సునేరు, పచ్చలను ప్రమద గణాలుగా సమ్మిళితం చేసి నిమ్మకా యతో చిత్రకన్ను నెలకొల్పి 46వరుసలలో పట్నాన్నివేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అష్టదిక్కులా నిమ్మ కాయ లు, గుమ్మడికాయలతో బలిహ రణచేసి పెద్దపట్నంపైకి ఆవాహనం చేశారు. ఒగ్గుపూజారులు బోనాలు తీసు కువచ్చి న అనంతరం ఆదివారం తెల్లవారుజామున గర్భాలయంలోనుంచి వీరశైవార్చకులు మహదేవుని మల్లికార్జున్, మహ దేవుని మనోహర్, మహదేవుని భాస్కర్, మహదేవుని రవి, తదితరులు ఉత్సవవిగ్రహాలను పోలీసుల రక్షణ వలయంలో తీసుకువచ్చి పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నం తొక్కడం ప్రారంభించారు. పెద్దపట్నాన్ని తిలకించిన భక్తులు మల్లన్నను స్తుతిస్తూ పట్నంపై చిందేస్తూ తన్మయత్వం చెందారు. పట్నం తొక్కిన శివసత్తులు, పోతురాజుల సిగాలతో పాటు మల్లన్న నామస్మరణతో, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ పరిసరాలు మారుమోగిపోయాయి. వేడుకలలో ఆలయ ఈవో రామాంజనేయులు, ధర్మకర్తలు పాల్గొన్నారు. జాగరణ కోసం పొరుగు మండలాలనుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ క్రిక్కిరిసిపోయాయి.

ఘనంగా అన్నపూజ, ఏకాదశరుద్రాభిషేకం

సోమవారం ఉదయం మల్లన్నకు విశేష సుగంధ పరిమళ పుష్పహారాలు అలంకరించారు. సాంప్రదాయబద్ధంగా ఏకాదశమహారుద్రాభిషేకం, అన్నపూజ నిర్వహించారు.

కళాకారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉండి కళలకు ఆదరణ కల్పిస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి 51వ ఆహ్వాన నాటిక పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కళారంగంతోనే సాధ్యమవుతుందన్నారు. నాటక రంగాన్ని 50 ఏళ్ల నుంచి బతికిస్తున్న కళాసమితి కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. తన వంతు సహాయంగా తల్లిదండ్రుల పేరున భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసి రూ.2లక్షలను ఇచ్చానన్నారు. ఆధునిక యుగంలో యువత, పిల్లలు, మహిళలు సైతం టీవీ, సినిమాలు, సెల్‌ఫోన్‌లకు బానిసై దేశ సంస్కృతి సంప్రదాయాలను మరచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న తెలంగాణ న్యాయవాద పరిషత్ ప్రధాన కార్యదర్శి సంసాని సునీల్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్, వరంగల్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్ హాజరై మాట్లాడారు. సమాజంలోని రుగ్మతలను పారదోలి ప్రజలను చైతన్యవంతం చేయడానికి కళా సమితి 50 ఏళ్లుగా పలు ఒడుదొడుకులను ఎదుర్కొని రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో భారతీయ నాటక కళా సమితి నిర్వహకులు అధ్యక్షుడు ఎమ్డీ.అప్సర్, కార్యదర్శి ఈగ సాంబయ్య, మాశెట్టి సోమయ్య, పోషల సూర్యనారాయణ, సమ్మెట శ్రీనివాస్, మోడెం కుమారస్వామి, పెద్దురి సంజీవరావు, భాస్కర చారి, సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, వడ్లకొండ రాజు, ఆరెల్లి వేణు, దీకొండ యుగేందర్, చెన్న శ్రీధర్, పెద్దురి రాజు, మైస వీరేందర్, సమ్మెట సుధీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ప్రముఖులకు సన్మానం


సమాజ హితం కోసం పాటుపడుతూ ఉత్తమ సేవలందిస్తున్న ప్రముఖులను భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కళాసమితి వేదికపై ఎమ్మెల్యే నాగరాజు సన్మానించారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరపాటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు పాములపర్తి రామారావు, రాడారు అప్లికేషన్స్‌పై పరిశోధనలు చేసి డాక్టర్ పట్టా పొందినందుకు డాక్టర్ చెన్న ప్రవీణ్‌కుమార్‌లను కళా సమితి కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే సన్మానించారు.

విజేతలు వీరే..

భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నాటికల పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగిలు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ కట్రాపాడు వారి కిడ్నాప్, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ నాటికలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

కళల మాస్టారు!

- వృత్తి ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి కళాకారుడు
- బహుముఖ ప్రజ్ఞాశాలి ఆడెపు రవీందర్



రవీందర్ రచనలు

కరీమాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వృత్తిరిత్యా ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి రిత్యా కళాకారుడు. రచయిత, రంగస్థలనటుడు, దర్శకుడిగానే కాక.. వెండితెరపై ఓ సినిమాలో హీరోగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా తన బోధనా పద్ధతితో విద్యార్థుల మనస్సుల్లో సుస్థిర స్థానం పొందడమే కాక ఆది నుంచి కళలను జీవితంలో ఓ భాగం చేసుకున్నారు. రంగస్థల కళాకరుడిగా ఎన్నో అవార్డులను అందుకున్న ఆయనకు వెండితెరపై కనిపించాలనే కోరికను నిజం చేసుకున్న వ్యక్తి. అయనే వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన ఆడెపు రవీందర్.

చిన్నప్పటి నుంచే..

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లిలో సుగుణమ్మ - చంద్రమౌళి దంపతులకు ఆడెపు రవీందర్ ద్వితీయ సంతానంగా 1964లో జన్మించాడు. హైస్కూల్ విద్యాభ్యాసం అంతా బొల్లికుంట గ్రామంలో, ఉన్నత విద్యాభ్యాసం వరంగల్ నగరంలో జరిగింది. ఎంఏ బీఈడీ చదివిన ఆయనకు 1984లో పెద్దపెండ్యాలకు చెందిన సంధ్యారాణితో వివాహం జరిగింది. రవీందర్ తన తండ్రి కోరిక మేరకు ఉపాధ్యాయ వృత్తి వైపు అడుగులు వేశాడు. ఈ క్రమంలో 1993లో ఎస్‌జీటీగా ఉద్యోగం పొందారు. ప్రస్తుతం శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు.

నటుడు, రచయిత, దర్శకుడు, హీరోగా..

ఆడెపు రవీందర్‌కు పాఠశాల స్థాయిలో ఉన్నప్పటి నుంచి కళారంగంపై మక్కువ ఉండేది. రచన, నటన పట్ల అమితమైన ఆసక్తి కనబరిచేవాడు. నటుడిగా, దర్శకుడిగా, రచయితగా రాణిస్తూనే ఉన్నారు. రంగశాయిపేట కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఏకపాత్రాభినయం నాటక పోటీల్లో 1993, 1994, 1995 సంవత్సరాల్లో వరుసగా విజేతగా నిలిచి అవార్డులు సొంతం చేసుకున్నారు. విద్యార్థులతో అమ్మాయి పెళ్లి అనే నాటిక వేయించి రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందాడు. అంతేకాకుండా ఇకనైనా మారండి, మీదాక వస్తే, నాటికల రచన, జీవన స్రవంతి టెలీ సీరియల్ నటన, రచన, ఫోర్త్ డిగ్రీ, అమ్మాయి పెళ్లి, యమహో తెలంగాణ షార్ట్ ఫిలిమ్స్‌లో నటన, రచన, దర్శకత్వం, రసమయి బాలకిషన్ నిర్మించిన జై తెలంగాణ సినిమాకు కథా రచన, మేడారం జాతరలో సుమన్ నటించిన సినిమాకు పాటల రచన, 2015లో విడుదలైన సీతాశ్రీరాం సినిమాకు రచన, దర్శకుడిగా, హీరోగా పనిచేశాడు.

అవార్డులు.. ప్రశంసలు..

2000లో అమ్మాయిపెళ్లి నాటికకు రాష్ట్రస్థాయి అవార్డు, 2009లో వరుడు డాట్‌కామ్ నాటికకు నంది నాటకోత్సవాలకు ఎంపిక, 2013లో సాంఘిక శాస్త్ర పుస్తకాలలో పాఠ్యాంశాల రచయితగా ప్రశంసలు, 2014లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు, ఇటీవల కాలంలో మరెన్నో షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా సామాజిక సందేశాలను అందించేలా ప్రశంసలు అందుకున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న రవీందర్ (ఫైల్)

చల్లంగ చూడు స్వామీ..

- రామప్ప ఆలయంలో కొనసాగుతున్న మొక్కులు
- నేటితో ముగియనున్న మహాశివరాత్రి ఉత్సవాలు


రామప్ప ఆలయ ఆవరణలో భక్తులు


రామప్ప ఆలయ గర్భగుడిలోభక్తులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం రామప్ప ఆలయంలో మొక్కులు కొనసాగాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆదిదేవుడిని కొలిచారు. 'హ రహర మహాదేవా.. శంభో శంకరా' అంటూ స్మరించుకుంటున్నారు. చల్లంగా చూడు స్వామీ.. అంటూ వేడుకుంటున్నారు. కోరిన కోర్కెలు తీర్చి పది కాలాలపాటు వర్ధిల్లేలా వరాలు ఇవ్వాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కవిత, ఈవో బిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. రెండోరోజు ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, గణపతిపూజ, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి 11గంటలకు గ్రహారాధన, వీరభద్ర పల్లేరము, సాయంత్రం భద్రకాళి పూజ, సహస్రనామం, బలిహరణ కార్యక్రమాలు, రాత్రి దీపోత్సవం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్‌లు తెలిపారు. మూడురోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో పోలీస్ బందోబస్తు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్సై జక్కుల సతీష్ పేర్కొన్నారు. ఉచిత వైద్య సేవలో భాగంగా డాక్టర్ చీర్ల శ్రీకాంత్, హెచ్‌వీ పుష్ప, ఏఎన్ఎం కనకలక్ష్మిలు భక్తులకు సేవలందించారు. అంతేకాకుండా నేటి ఉదయం జరిగే అగ్నిగుండాల మహోత్సవ కార్యక్రమానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. భక్తుల కోసం సకల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో పేర్కొన్నారు. రెండురోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేశారు. దీంతో రామప్పలో పండుగ వాతావరణం నెలకొంది. నేటి అగ్నిగుండాల మహోత్సవ కార్యక్రమంతో రామప్పలో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వర్గాలు చెబుతున్నారు.


వివిధ దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేస్తున్న భక్తులు

నివాళులర్పించిన మంత్రి సీతక్క


మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొర్నిబెల్లి రాఘవరావు బుధవారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గురువారం పరామర్శించారు. ఆమె వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


వెంకటాపురంలో శివపార్వతుల కల్యాణంలో వేదపండితులు

వెంకటాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి దేవాయలంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. ఉత్సవ పందిరి వద్ద ఆలయ కమిటీ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయగా రాత్రి 10గంటలకు వేపచెట్టు సెంటర్‌లో ఎదుర్కోలు సన్నాహక కార్యక్రమం జరిపించారు. మండలంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సమక్షంలో రాత్రి 11గంటల నుంచి స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులు స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలిరాగా వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ములుగు జిల్లాలో 92.83 శాతం పోలింగ్ • 628 మంది ఉపాధ్యాయులలో ఓటేసింది 583 మంది


ములుగులోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దివాకర


ములుగులోని పోలింగ్ కేంద్రంలో సిబ్బంది

ములుగు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వరంగల్-నల్లగొండ-ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జిల్లాలో గురువారం జరిగిన ఎన్ని కలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మండలానికి ఒకటి చొప్పున తొమ్మిది మండలాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటల వరకు నిరాటంకంగా కొనసాగింది. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. కలెక్టరేట్‌కు అనుసంధానించగా ఇక్కడి నుంచి కలెక్టర్ దివాకర, అధికారులు పర్యవేక్షించారు. ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మహేందర్, ఆర్డీవో వెంకటేశ్‌తో కలిసి కలెక్టర్‌సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ములుగు, వెంకటాపూర్‌లోని పోలింగ్ సెంటర్లను ఎస్పీ శబరీశ్ సందర్శించి భద్రతా చర్యలను పర్యవేక్షించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను ములుగుకు తీసుకొచ్చి పోలీసు భద్రత నడుమ నల్లగొండకు తరలించారు.


ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగురాలు

- 92.83 శాతం పోలింగ్..

జిల్లాలో మొత్తం 628 మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 405 మంది కాగా, మహిళలు 223 మంది. మొత్తం 583 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 92.83శాతం పోలింగ్ నమోదైంది. 200 మంది మహిళా ఓటర్లు, 383 మంది పురుష ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. అత్యధికంగా ఏటూరునాగారం మండలంలో 95.65శాతం పోలింగ్ నమోదైంది. 46మందికి గానూ 44 మంది ఓటేశారు. ములుగులో 193 మందికి గానూ 180, వెంకటాపూర్‌లో 40 మందికి 35, గోవిందరావుపేటలో 108 మందికి 102, తాడ్వాయిలో 65మందికి 58, కన్నాయిగూడెంలో 19 మందికి 18, మంగపేటలో 95మందికి 88 మంది, వాజేడులో 33 మందికి 31, వెంకటాపురం మండలంలో 29 మందికి 27 మంది ఉపాధ్యాయులు ఓటేశారు.

భద్రత కట్టుదిట్టం

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. రెండురోజుల ముందే ఆయా పోలింగ్ కేంద్రాల పరిసరాలను తమ ఆధీ నంలోకి తీసుకున్నారు. 200 మందికి పైగా సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ శబరీశ్ పర్య వేక్షణలో ఓఎస్డీ గీతే మహేష్, ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్ ఆయా మండలాల సీఐలు, ఎస్సైలతో కలిసి భద్రతా చర్యలు చేపట్టారు. 144 సెక్షన్ విధించడంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పహారా కాశారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఏఎస్పీ

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పరిశీలించారు. పోలింగ్‌కేంద్రం వద్ద ఉన్న సౌకర్యాలను పరిశీలించడంతోపాటు ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని సిబ్బం దికి ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు, వాజేడు ఎస్సై రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై పోలీసులు గట్టి నిఘా పెట్టారు. ములుగు ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆధ్వర్యంలో వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావుల పర్యవేక్షణలో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మండలంలోని గోదావరి ఫెర్రీ పాయింట్లు, అటవీ ప్రాంతం, పోలింగ్ కేంద్రం వద్ద డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

వెంకటాపురం సర్కిల్ పరిధిలో..

వాజేడు (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. వెంకటాపురం సర్కిల్ పరిధిలోని వెంకటాపురం, వాజేడు, పేరూరు స్టేషన్ల పరిధిలోని సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక డ్రోన్ కెమారాలను వినియోగించి మావోయిస్టుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎన్నికకు సంబంధించి మావోయిస్టులు ఏమైనా దాడులకు పాల్పడే అవకాశం ఉండటంతో పోలీసులు పక్కా ప్రణాళికలతో వ్యవహరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు టెక్నాలజీని వినియోగించారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవులను డ్రోన్లలో జల్లెడ పట్టారు. మాజీ మావోయిస్టులు, రౌడీషీటర్ల కదలికలపై ముందు గానే నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. సీఐ కుమార్, ఎస్సైలు కృష్ణప్రసాద్, తిరుపతిరావు, రాజ్‌కుమార్ నేతృత్వంలో ఏజెన్సీలో ఉపాధ్యాయ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి.

బొగ్గు వెలికితీత పనులు యాజమాన్యమే చేపట్టాలి

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ శ్రేణులు

కాకతీయఖని, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-8వ గనిలోని రెండో సీమ్‌లో బొగ్గు వెలికితీసే పనులను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వకుండా యాజమాన్యమే చేపట్టాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఆ సంఘం ఆధ్వర్యంలో ఏరియా జీఎం కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. అనంతరం ఎస్‌వోటూ జీఎం కవీంద్రకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, సుధాకర్‌రెడ్డి, విజేందర్, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజామార్గం అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దే శంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విరివిగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. భూపాల పల్లి పట్టణంలోని అంగడిలో మొబైల్ వ్యాన్‌తో కార్యక్ర మం నిర్వహించారు. మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిచనున్నట్టు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల సూచించారు. క్షణికావేశాలకు పోయి, పగలు, పంతాలు పెంచుకొని కేసుల్లో ఇరికితే పోలీస్‌స్టేషన్లు కోర్టులకు తరగడం వల్ల నష్టమే తప్ప ప్రయోజనం ఉండదన్నారు. విలువైన సమయం, మనశ్శాంతి, డబ్బు కోల్పోవాల్సి వస్తుందన్నారు. పేదరికంతో ఉన్న కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను నేరుగా సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న మహేందర్

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవ గాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. మల్లంపల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల/ కళాశాల (బాలురు)లో గురు వారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన అవగా హన కల్పించారు. మోటార్ వెహికిల్, విద్యాహక్కు చట్టం, బాల్య వివాహ నిరో ధకం, బాలకార్మికులు, ఆస్తిహక్కు, పోక్సో చట్టాలు, ఉచిత న్యాయం ఎలా పొందాలో అవగాహన కల్పించారు. ఈ సదస్సులో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, ప్రధానోపాధ్యాయుడు జి.అంకయ్య, ఉపాధ్యాయులు జె.రమేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అడవిలో మంటలకు అడ్డుకట్ట

తాడ్వాయి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటవి శాఖ అధికారులు అడవుల్లో ఎరగడి మంటలకు అడ్డుకట్టలు వేశారు. ఈ క్రమంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అటవి అధికారులు తెలిపారు. ఈ క్రమంలో 25మంది ప్రత్యేక తాత్కలిక సిబ్బందితో అడవిలో నిప్పు అంటుకున్న సమాచారం వచ్చిన వెంటనే 25 ర్యాకర్స్ నిప్పును యంత్రాల ద్వారా పక్కకు తొలగించి నీళ్ల చల్లారు.

మృతుడి కుటుంబానికి బియ్యం పంపిణీ

గోవిందరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన మాడే జగ్గారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, నాయకులు పరామర్శించారు. ఈసందర్భంగా సాంబశివ బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ చేసి మాట్లాడారు. చేతికి అందివచ్చిన కొడుకు మృతిచెందడం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు సీపీఎంపార్టీ కృషిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి, మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు గొంది రాజేష్, అంబాల మురళి, మంచోజు బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో ఒకరి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తాడ్వాయి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండ లం లోని నార్లాపూర్ శివారు చింతల్ క్రాస్ సమీప జంపన్నవాగు చెక్‌డ్యామ్ వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్లాపూర్‌కు చెందిన ఈక కృష్ణమూర్తి జంపన్నవాగు చెక్‌డ్యామ్ వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెక్‌డ్యామ్‌లో నిలిచిన నీటిలో విద్యుత్ సరఫరా అవుతుండగా ఇది గమనించక కృష్ణమూర్తి షాక్‌కు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు..

రేగొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బాగిర్తిపేట గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాగిర్తిపేటకు చెందిన సుంకరి రవి(59) బుధవారం ఉదయం నుంచి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. రాత్రి గ్రామంలోని బావిలో మృతదేహాన్ని స్థానికుడు గుర్తించాడు. గ్రామస్థుల సహాయంతో బావిలోకి దిగి చూడగా సుంకరి రవి మృతదేహమే అని గుర్తించారు. రవి తరచుగా ఆ బావి నుంచి నీళ్ల తెచ్చేవాడని, ఈ క్రమంలో కాలు జారి పడి ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య పుష్ప ఉన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

చిట్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన యువకుడు కుటుంబంలో ఘర్షణలతో మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన పెద్ది సతీష్ (32)కు కాటారం మండలం గూడూరుకు చెందిన లక్ష్మితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. సతీష్ మద్యానికి అలవాటు కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో నెల రోజుల క్రితం ఇరువురి మధ్య మళ్లీ ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో లక్ష్మి తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన సతీష్ గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత సమయం తర్వాత గమనించిన గ్రామస్థులు చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతడి తల్లి కిట్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జగ్గన్నపేట ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా గురువారం సందర్శిం చారు. ఈసందర్భంగా ఆమె పాఠశాల పరిసరాలను పరిశీలిం చడంతోపాటు కిచెన్, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లు, డార్మెటరీలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డైనింగ్‌హాల్‌లోని రెండు ప్రాంతాల్లో ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టాలని, మరుగుదొడ్ల బ్లాక్‌లో నాణ్యతో పనులు చేపట్టి అదనపు మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణాన్ని పూర్తిచేసి పెయింటింగ్ వేయాలని, డార్మెటరీలో కిటికీలకు మెష్‌ను అమర్చాలని, తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్‌ల మరమ్మతు, పెయింటింగ్ పనులు చేపట్టాలని ఇంజనీర్లను ఆదేశించారు. రోజువారీ మెనూ పాటిస్తూ విద్యార్థినులకు వేడి ఆహారాన్ని అందించాలని హెడ్‌మాస్టర్, వార్డెన్‌లకు సూచించారు. ఆమె వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరభద్రం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రశాంత్, అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మణ్, టెక్నికల్ ఆఫీసర్ సురేష్, తదితరులు ఉన్నారు.


ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న పీవో

కాటాపూర్‌లో విద్యార్థులతో అమెరికా రాయబారి ముచ్చట్లు

తాడ్వాయి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాటాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అమెరికా రాయబారి జానీఫర్ లాడ్సన్ గురువారం సందర్శిం చారు. జిల్లాలో ఆమె పర్యటించగా పలు ప్రాంతాలను ఆమె సందర్శిం చారు. ఈ క్రమంలో కాటాపూర్ పాఠశాలకు వచ్చిన ఆమె అక్కడి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. బాగా చదువుకొని అంచె లంచెలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆ మె వెంట మాజీ సర్పంచ్ పులి రవిగౌడ్, పలు శాఖల అధికారులు ఉన్నారు.


కాటాపూర్‌లో అమెరికా రాయబారితో విద్యార్థులు

దుస్తులు అమ్ముకుని తిరిగివస్తూ..

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాలకు వెళ్లివస్తుంటారు. ఈ క్రమంలో నెల రోజుల కిందట దంపతులు ద్విచక్రవానంపై రెడీమేడ్ దుస్తులను విక్రయించడానికి గ్రామం నుంచి వెళ్లారు. శివరాత్రి పండుగ వరకు ములుగు జిల్లాలోని పలు గ్రామాల్లో బట్టలు విక్రయించారు. పండుగ ముగి యడంతోపాటు వచ్చే నెల 2 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుండడంతో ద్విచక్రవానంపై స్వగ్రామానికి గురువారం బయలుదేరారు. ఈ క్రమంలో మలంపల్లికి సంతకు వచ్చారు. మేకను కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళ్తున్నక్రమంలో ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని బొల్లోనిపల్లి సమీపంలో వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ సంఘటనలో మహబూబ్ లారీ చక్రాల కింద నలిగిపోయి మరణించాడు. రోడ్డుపై ఎగిరిపడ్డ సకీనా తలకు తీవ్ర గాయాలతో ఘటనా స్థలిలోనే మరణించింది. మృతదేహాలను ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించిన ములుగు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహబూబ్‌కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. దంపతుల మృతితో బుధరావుపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మధు

మల్హర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచారంలో పలు బాధ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గురువారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి అన్నదమ్ములు రాజు, శంకర్ మృతి చెందగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. అనారోగ్యంతో బాధపడతున్న చిదురాల పురుషోత్తంను పరామర్శించారు. అనంతరం మల్లన్నగుట్టపై సాగుతున్న జాతరలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు గోనె శ్రీనివాస్‌రావు, వాల యాదగిరిరావు, కాసాని శ్రీశైలం, సది, రాజేందర్, భాస్కర్, సమ్మయ్య, సుధాకర్, వెంకయ్య, కుమార్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ కమిటీ ఎన్నిక

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మొగుళ్లపల్లి నూతన గ్రామ కమిటీని గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చదువ అన్నారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆశాడపు వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా ఓనపాకల రాజమౌళి, ఎన్నిళ్ల సదయ్య, యూత్ అధ్యక్షుడిగా నక్క దేవేందర్‌కుమార్ ఎన్నికయ్యారు.